క్లుప్తంగా

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపండి


శాలువా కప్పి సత్కరిస్తున్న కలెక్టర్

వాజేడు: జాతీయ స్థాయిలో జరిగే చెస్ పోటీల్లో ప్రతిభ చూపాలని జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. వాజేడు ఉన్నత పాఠశాలలో పీటీగా పని చేస్తున్న తెల్లం రాజ్యలక్ష్మిని బుధవార ఆయన శాలువా కప్పి అభినందించారు. ములుగు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలతో పాటు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అకలెక్టర్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా క్రీడల అధికారి పీవీఆర్ చారి, వాలీబాల్ కోచ్ సంపత్, రాంబాబు ఉన్నారు.

విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న పెట్టిం రాజు

ములుగు: హార్ట్‌బీట్ ఫౌండేషన్ ఫర్ విజ్యువల్లీ ఇన్‌పేయిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో అంధుల సంక్షేమం కోసం సేకరించిన రూ.7,700 విరాళాన్ని సన్ రైజర్స్ కరస్పాండెంట్ పెట్టిం రాజు బుధవారం జిల్లాకేంద్రంలో సంఘం సభ్యుడు రాకేశ్‌శర్మకు అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. మానసిక వికలాంగులకు ప్రతి ఒక్కరూ తోచిన సాయం చేయాలని కోరారు. విద్యార్థి దశ నుంచి సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పాఠశాల విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బల్గూరి జనార్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు చేయించుకోవాలి


సన్మానిస్తున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె): వయస్సుతో పనిలేకుండా ప్రతి మహిళ తన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్ యామిలి అన్నారు. బుధవారం మండలంలోని ఎదిర పంచాయతీలో నూతన పథకం ఆరోగ్య మహిళ అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే మహిళాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి అప్పయ్య, ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ పాల్గొన్నారు.

పరామర్శ


రిశాంత్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం చల్వాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి అల్లం రిశాంత్ (07) మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బొట్ల కార్తీక్ బుధవారం ఈ మేరకు రిశాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి మృతికి కారణమైన ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ముఖేష్, కోగిల అజయ్, రాజు, సలీం, దుర్గ తదితరులు ఉన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

పలిమెల : ప్రభుత్వ వ్యతిరేక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని పలిమెల ఎస్సై అరుణ్ అన్నారు. బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా మండల కేంద్రంలోని గొత్తికోయ గూడెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని గొత్తికోయలతో మాట్లాడుతూ ఎవ్వరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను పాఠశాలకు పంపి మంచి చదువును అందించాలన్నారు. అనంతరం కానిస్టేబుల్ అశోక్ వారి తండ్రి పుట్టిన రోజు సందర్భంగా గూడెంలోని 16 మంది గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఎస్సై అరుణ్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, చిత్రంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య తదితరులు


ములుగు: మాణేశ్వర్‌రావును సన్మానిస్తున్న డీఈఓ పాణిని, మహిళా ప్రజాప్రతినిధులు


పస్రాలో మాట్లాడుతున్న మాధవి


ఏటూరునాగారం: ప్రజాప్రతినిధులు, జెడ్పీ డిప్యూటీ సీఈఓను సన్మానిస్తున్న జర్నలిస్టులు


ములుగు రూరల్: మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్ అహ్మద్‌పాషా


మహిళలు వ్యాపారాల్లోనూ రాణించాలి

ములుగు: జిల్లాలో మహిళా సంఘాల సభ్యులు ఉమ్మడి వ్యాపారాలు, యూనిట్లను పెంచుకొని రాణించాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200కోట్ల రుణాలు సీఐఎఫ్, స్త్రీనిధి రుణాలను అందించిందని వివరించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలుగుతారని తెలిపారు. ఒత్తిడి ఎదుర్కొనే వారి కోసం జిల్లాలో ప్రతీ మంగళవారం ప్రత్యేకంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎదిర, రొయ్యూరు పీహెచ్‌సీల్లో పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడారు. మహిళల అణిచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాట ఫలితంగానే మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. అనంతరం ఉత్తమ పనితీరును కనబరిచిన గట్టమ్మ గ్రామైఖ్య సంఘానికి బ్యాంకు లింకేజీ ద్వారా వచ్చిన వడ్డీ రాయితీ రూ. 53.32లక్షల చెక్కు, పావలా వడ్డీ రుణాల పత్రాలను కలెక్టర్ అందజేశారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణంలో పాలంపేట రామప్ప చీరల స్టాల్స్, సమ్మక్క–సారక్క చల్వాయి గ్రామైఖ్య సంఘం సభ్యులు తయారు చేసిన శానిటరీ ప్యాడ్స్ స్టాల్‌ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సాయిబాబా గ్రామైఖ్య సంఘం రాయిని గూడెం సభ్యులు తయారు చేసిన జూట్ బ్యాగ్ స్టాల్ ని ప్రారంభించి వాటి వివరాలు తెలుసుకున్నారు. శ్రీరామ సంఘం కమలాపురం సభ్యులు తయారు చేసిన పచ్చళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నాగ పద్మజ, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పల్లా బుచ్చయ్య, ములుగు జెడ్పీటీసీ సకినాల భవాని, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు లేనిదే సమాజం లేదు

మహిళలు లేనిదే సమాజం లేదని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు పాయం మాణేశ్వర్ రావు అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేంద్రంలోని సంక్షేమ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి మాట్లాడారు. విద్యార్థుల గీతాలాపన, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం డీఈఓ పాణిని, క్వాలిటీ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్, పీఆర్టీయూ నాయకులు, ప్రజాప్రతినిధులు మాణేశ్వర్ రావును శాలువాతో సన్మానించారు. పీఆర్టీయూ టీఎస్ జనరల్ సెక్రటరీ యాకూబ్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ ఎన్నం విజయమ్మ, ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల జెడ్పీటీసీలు సకినాల భవాని, గై రుద్రమాదేవి, ములుగు ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్, బుర్రి రజిత పాల్గొన్నారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం గోవిందరావుపేట మండలంలోని పస్రాలో నిర్వహించగా సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం సమాన హక్కులు కల్పించినప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని అన్నారు. మహిళలకు 7 గంటల పని దినాల కోసం కొట్లాడితే మోదీ ప్రభుత్వం 12 గంటల పని దినాలను తీసుకొచ్చి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. సఖి కేంద్రాలను పెంచాలని మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మంచాల కవిత, మండల కార్యదర్శి జిమ్మ జ్యోతి, పాయం శారద, సరిత, రజిత, సరోజన, పద్మ,కందుల రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం

ములుగు రూరల్: మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని కాశిందేవిపేట సర్పంచ్ ఎండీ అహ్మద్‌పాషా అన్నారు. మహిళా ఉద్యోగులకు నూతన వస్త్రాలను బహుకరించి, శాలువాలతో సన్మానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తిలో ఆర్థిక, వ్యాపార, రాజకీయ రంగాల్లో ముందుండాలన్నారు.

మహిళలతోనే కుటుంబాల అభివృద్ధి

ఏటూరునాగారం: మహిళలతోనే కుటుంబాల అభివృద్ధి సాధ్యమని ములుగు జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏటూరునాగారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్‌పాషా, గౌరవ అధ్యక్షుడు నూక ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్‌లు ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీటీసీ సుమలత, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమాదేవి, ఉప సర్పంచ్ కర్ల అరుణను ఘనంగా సన్మానించారు. ఈసంద్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రెస్ మిత్రులు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎంపీపీ అంతటి విజయ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే అవకాశం ప్రజాప్రతిధులుగా తమకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ప్రజాప్రతినిధి మార్గాన్ని ఎంచుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈసం రామ్మూర్తి, ఎంపీడీఓ కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, సలీం, నాగరాజు, శ్రీను, గోపి, గోవర్ధన్, సాయి, సురేష్, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సత్యం, రాజేష్, శ్రీను, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

గోవిందరావుపేట మండలం చల్వాయిలో పంచాయతీ కార్మికులను, ఆశాలను బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ బొట్ల కార్తీక్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారిత బీఎస్పీతోనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ముఖేష్, అజయ్, ఉపసర్పంచ్ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మనుగడకు మహిళే ముఖ్యం

వాజేడు: సమాజ మనుగడకు మహిళలే ముఖ్యమని పలువురు వ్యాఖ్యానించారు. బుధవారం జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, ఉద్యోగులు కలిసి మహిళా ఉద్యోగులను శాలువా కప్పి సన్మానించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మహిళ లేకపోతే సమాజమే లేదని, ప్రతీ మగవాడి విజయం వెనుక మహిళ ఉంటుందనే సత్యాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించాలన్నారు. మహిళలు చేసే కష్టాన్ని మగవాళ్లు ఒక్క రోజు కూడా చేయలేరని తెలిపారు. ప్రతీ రంగంలో మహిళలు రాణిస్తున్నారని ఇంకా ఎదగాలని ఆకాంక్షించారు.

అన్ని రంగాల్లో ముందుడాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలవాలని వృత్తి స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పుష్పారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మేడారంలో హెచ్‌డీఎఫ్‌సీ ఆర్థిక సహకారంతో వృత్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ మహిళలు హెచ్‌డీఎఫ్‌సీ సహకారాన్ని వినియోగించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. బాలికలను చిన్న చూపు చూడకుండా విద్య ఉద్యోగ రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్న మహిళలు ఉన్నత స్థితిలో ఉన్నవారిని ఆదర్శంగా తీసుకొని ధైర్యంగా ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమానికి ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట గ్రామాలకు చెందిన మహిళలు హాజరయ్యారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అఖిల్, ప్రశాంత్, బాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎస్‌తాడ్వాయి మండలంలోని మేడారంలోని గిరిజన ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సరోజనతోపాటు ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ వార్డెన్ సృజన, ప్రశాంతి, శోభ, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, తేజ్యా, పీడీ లక్ష్మీనారాయణ, జవహర్, వీరన్న పాల్గొన్నారు.

సీనియర్ ఉద్యోగులకు సన్మానం

మంగపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని హెచ్‌ఎం మేనక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎం మేనక, ఇటీవల రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన మంజులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాలు శాంతకుమారి, అనసూర్య, వరలక్ష్మి, భాగ్యమ్మ, నాగమ్మ, అనసూర్య, కృష్ణవేణి, విజయ, కవిత, స్రవంతి, మంజుల పాల్గొన్నారు.


వాజేడు: కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు


వాజేడు: మహిళా ఉద్యోగులకు సన్మానం..


ఎస్ఎస్‌తాడ్వాయి: మాట్లాడుతున్న పుష్పారెడ్డి


ఎస్ఎస్‌తాడ్వాయి: ఉపాధ్యాయినులకు సన్మానం


మంగపేట: సీనియర్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

ప్రభుత్వం పేదలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కాటాపూర్‌లో ఇళ్ల స్థలాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బుధవారం మాట్లాడారు. కాటాపూర్‌లో గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు ఆరున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసిందన్నారు. ఆ భూమిలో సుమారు రెండు ఎకరాల్లో డబుల్ బెడ్ రూంలను నిర్మించారని తెలిపారు. ఇంకా నాలుగు ఎకరాలు భూమి ఖాళీగా ఉందని, కొంతమంది ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో అనేకమంది పేదలకు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే గ్రామసభ నిర్వహించి అర్హులైన పేదలను గుర్తించి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ స్థలంలో పేదలను సమీకరించి గుడిసెలు నిర్మిస్తామని హెచ్చరించారు. సర్పంచ్ గౌరమ్మ పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఇళ్ల స్థలాల పోరాట కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ దుగ్గి చిరంజీవి, నాయకులు బొప్పార బాబురావు, మల్లికార్జున్, పోలెబోయిన రమేష్, రోమన్, గట్టు మల్లయ్య, నరసింహారావు, మైపతి గోపాల్, నరేష్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జర్నలిస్టుల విన్నపం

ఏటూరునాగారం: సమాజంలో విలేకరుల పాత్ర చాలా ముఖ్యమైనదని ప్రభుత్వానికి, అధికారులకు ప్రజల సమస్యలను తెలియజేయడంలో విలేకరుల వారధిగా ముఖ్య పాత్ర పోషిస్తారని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆరోగ్యమహిళా పథకాన్ని ప్రారంభించడానికి వచ్చిన కలెక్టర్ కృష్ణ ఆదిత్యను ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు అఫ్జల్ పాషా, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అఫ్జల్ పాషా కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. గతంలో ప్రెస్ క్లబ్ భవనం కోసం దరాఖాస్తు చేసుకున్నామని కలెక్టర్‌కు గుర్తు చేశారు. అంతే కాకుండా ప్రెస్ క్లబ్ స్థలం, భవన నిర్మాణం కోసం కావాల్సిన చర్యలు చేపడుతామన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ కృష్ణ ఆదిత్య నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న జర్నలిస్టులు

వర్గీకరణను విస్మరించిన బీజేపీ

కాటారం: ఎస్సీ వర్గీకరణను విస్మరించిన బీజేపీని రాజకీయంగా బొందపెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బట్టు విజయ్‌కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మోసాన్ని నిరసిస్తూ మాదిగల సంగ్రామ పాద యాత్ర బుధవారం కాటారం చేరుకొంది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మార్చి 6న అంబట్‌పల్లిలో సంగ్రామ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి చట్టబద్ధత కల్పించడం లేదని పేర్కొన్నారు. వర్గీకరణ చట్టబద్ధత కోసం ఏప్రిల్ 4న హైదరాబాద్‌ను వేలాది మందితో దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. మాదిగ బిడ్డలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు మారుపాక లచ్చయ్య, గాజుల భిక్షపతి, చంద్రగిరి అశోక్, మంథెన రాకేశ్, మంథెన చిరంజీవి, శ్రీనివాస్, అకాశ్, నరేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్రలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

వైభవంగా సదాలమ్మ, లక్ష్మీదేవర ఎదుర్కోలు


డోలి వాయిద్యాలతో సదాలమ్మ సంబురాలు నిర్వహిస్తున్న పూజారులు

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని కన్నాయిగూడెంలో సదాలమ్మ, లక్ష్మీదేవర అమ్మవారి ఎదుర్కోలు మహోత్సవ కార్యక్రమం శ్రీ నాగులమ్మ ఆలయ ప్రధాన పూజారి, నాగులమ్మ ఉపాసకుడు(ఆలయ ట్రస్టి) బాడిష రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అత్యం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనర్సాపురంలోని శ్రీ నాగులమ్మ ఆలయంలో ప్రారంబమైన జాతర రెండో రోజు కార్యక్రమంలో బాగంగా సదాలమ్మ పూజారి కొమరం నితిన్, ఆలయ పూజారులు, వడ్డెలు ఆలయ సమీపంలోని ఝెర్రట్టలగుట్ట వద్ద ఆదివాసీ గిరిజన సంప్రదాయం ప్రకారం.. ప్రత్యేక పూజలు నిర్వహించి సడాలమ్మ అమ్మవారిని డోలి వాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. లక్ష్మీదేవర అమ్మవారిని పూజారులు బొనతల సాగర్, నాయుడు పోచాలు బృదం, నాగులమ్మ ప్రతిరూపాలు అయిన జెండా కర్రలతో పూజారులు, వడ్డెలు గిరిజన సంప్రదాయ బద్దంగా సంబరాలు నిర్వహించి ఎదుర్కోలు పలికారు. సదాలమ్మ అమ్మవారు ఆలయానికి వచ్చేక్రమంలో సమీపంలోని వాగొడ్డుగూడెం, కన్నాయిగూడెం, లక్ష్మీనర్సాపురం గ్రామాల నుంచి ఆదివాసీ గిరిజన మహిళలు, యువతులు నీళ్లార బోసి సల్లంగ చూడమని వేడుకున్నారు. అనంతరం పూజారులు, వడ్డెలు సడాలమ్మ అమ్మవారిని గద్దెపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. గురువారం నాగులమ్మ అమ్మవారి జాతర సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి భక్తులు ఆలయానికి చేరుకుంటుండటంతో భక్తుల సందడి నెలకొంది.

నేడు నిండు జాతర

ఈనెల 7 నుంచి ప్రారంభమై 11 వరకు ఐదు రోజుల పాటు జరిగే శ్రీ నాగులమ్మ జాతరలో మూడో రోజు నిండు జాతర. మూడోరోజు కార్యక్రమంలో భాగంగా గురువారం గండొర్రెగుట్ట వద్ద శ్రీ నాగులమ్మ పూజారి బాడిష నాగరమేష్, వడ్డెలు, పూజారులు గిరిజన సంప్రదాయం ప్రకారం పూజ లు నిర్వహించి అమ్మవారిని ఆలయానికి తీసుకొస్తారు. రాజుపేట బస్టాండ్ సెంటర్ వద్ద, రమణక్కపేట సమీపంలోని ఎర్రమ్మతోగు(గడీలగుట్ట) ప్రాంతంలోని పాలమాకుల ఒర్రె వద్ద వడ్డె కుర్సం పుల్లయ్య వనదేవత(కంకవణం)కు ప్రత్యేక పూజలు నిర్వహించి గుడికి తీసుకొచ్చే క్రమంలో నాగులమ్మ, వనదేవత(కంకవనం)కు ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఆదివాసీ గిరిజన సంస్కతి సంప్రదాయం ప్రకారం వైభవంగా నిర్వహిస్తారు. అదే రోజు నిండు జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నాగులమ్మ ఉపాసకుడు రామకష్ణ స్వామీజీ(అమ్మవారి) అనుగ్రహంతో ఒంటి గంట నుంచి తెల్లవారు జామున 04 గంటల వరకు అగ్ని గుండంలో నడుస్తారు.

జాతర ఏర్పాట్లు పూర్తి

శ్రీనాగులమ్మ మహాజాతరలో ప్రధాన ఘట్టమైన నిండు జాతరకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మ, జిల్లాలతో పాటు పొరుగున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి భక్తులు లక్ష మందికి పైగా తరలివచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ఉండేందుకు ఆలయ ప్రధాన పూజారి బాడిష రామకృష్ణ, నాగరమేష్ ఆధ్వర్యంలో ఆలయంలో విద్యుత్‌దీపాలు, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేశారు.


నీళ్లారబోస్తున్న మహిళలు


ఎదుర్కోలుకు తీసుకెళ్తున్న పూజారులు


యర్రట్టల గుట్ట నుంచి సదాలమ్మ అమ్మవారిని గద్దెకు తీసుకువస్తున్న పూజారులు, వడ్డెలు

బాల్యవివాహాలు చేయొద్దు

వాజేడు: బాల్య వివాహాలు చేయడం నేరమని వాజేడు ఎస్సై రేక అశోక్ అన్నారు. మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ తన సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడుతూ మేజర్లు కాకుండా ఏ ఒక్కరికీ వివాహాలు చేసినా చట్ట ప్రకారం నేరం అని తెలిపారు. గ్రామంలో పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు ఆడితే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామంలోకి కొత్తవారు వస్తే ఆశ్రయం కల్పించొద్దన్నారు. గొడవలు, కొట్లాటలకు దూరంగా ఉండాలని సూచించారు.


గ్రామస్తులతో ఎస్సై అశోక్